
# సత్యవాక్కు

## క్రైస్తవ మాస పత్రిక

# THE WORD OF TRUTH



FEBRUARY 1995

## క్రైస్తవ కీర్తనలు

286 పాటలు గల క్రైస్తవ కీర్తనల పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక క్రొత్త పాటలు, సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న పాటలు చేర్చబడినవి. ఒక్కొక్క కాపీ వెల రూ॥ 12/- మాత్రమే. పోస్టేజీ ఇంకొక రెండు రూపాయలు. వలయువారు ఈ దిగువ చిరునామాకు రూ॥ 14/-లు **M. O.** చేసి పొందండి:

**SATYAVANI,**
**Samba Murthy Street,**
**Kakinada - 533 004.**

## ఆత్మ బంధువు

అను మరియొక ఆధ్యాత్మిక మాస పత్రిక బెంగుళూరు నుండి వెలువడు చున్నది. దీనిని బెంగుళూరులో మత్తికెరె ఏరియాలోని క్రీస్తు సంఘము ప్రచురించు చున్నది. ఈ పత్రిక వలయువారు ఈ దిగువ చిరునామాకు **25**/- రూ॥లు మాత్రము సాలు చందా మనియార్డరు చేసి పొందండి.

The Editor
**ATMA BANDHUVU**
**No. E. 40, North 5th Lane**
**I T.I. Colony, BANGALORE-560016.**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box 80, KAKINADA,, A.P. 533 001

Phone ; 0884-73722

Editor ;
J.C. CHOATE

Managing Editor
JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 15 ఫిబ్రవరి 1995 సంచిక 7


## సంపాదకీయం

### "అపవాది తంత్రములను ఎరుగనివారము కాము"

### ( We are not Ignorant of Satan's Devices)

సాతాను, అపవాది, దుష్టుడు అను వానిని గూర్చి మనం ఎరిగియే యుందుము. అతడు మన విరోధి యని వర్ణించబడినాడు. మరియు ఎవని మ్రింగుదునా యని గర్జించు సింహామువలె తిరుగుచున్నాడు (1 పేతురు 5:8). "అపవాది మొదటినుండి పాపము చేయుచున్నాడు గనుక పాపముచేయువాడు అపవాది సంబంధి; అపవాదియొక్క క్రియలను లయముచేయుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెనని" యోహాను వ్రాసాడు (1 యోహాను 3:8). మరియు "ఆదినుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలిచినవాడు కాదు, వానియందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై

యున్నాడని" యేసుప్రభువు చెప్పారు (యోహాను 8:44). తరువాత "దేవునికిలోబడి యుండుడి; అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవునని" యాకోబు సలహానిచ్చాడు (యాకోబు 4:7).

ఆదిలో అపవాది ఆదాము హవ్వలను శోధించాడు. తత్ఫలితముగా వారు దేవుని యెదుట పాపము చేసారు. మరియు ఏదెను వనమునుండి జీవ వృక్షమునుండి వారు తరిమివేయబడ్డారు. వారు దుష్టుని మాటల నాలకించినందు వలన పాపము లోకములో ప్రవేశించింది. మరియు దాని దుష్పరిణామాలు సంభవించినాయి. ఈలోకంలో క్రీస్తు యున్నపుడు అపవాది ఆయనను కూడ శోధించాడు. అయితే ప్రతి సందర్భములోను ఆయన దేవుని వాక్యమును వినియోగించి శోధనను జయించెను (మత్తయి 4:1-11).

సాతానుడు శక్తిమంతుడే అయినను, మనము చోటిస్తేనే తప్ప అతని ప్రభావము మనమీద యేమీ వుండదు. అతడు తరుచు మనలను శోధించవచ్చును. అయితే "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు; మీరు సహింపగలిగినంతకంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడనియ్యడు. అంతేకాదు సహింపగలుగుటకు ఆయన శోధనతోకూడ తప్పించుకొను మార్గమును కలుగజేయును" అని పౌలు మనకు తెలియజేయు చున్నాడు (1 కొరింధి 10:13). తప్పించుకొను మార్గమొకటి యున్నది. అయితే ఒకడు తప్పించుకొనాలని ఆశపడాలి. ఒకడు తప్పించుకొనుటకు ప్రయత్నించని యెడల, దేవుడు కూడ అతనికి సహాయం చేయలేడు.

"సాతాను మనలను మోసపరచకుండునట్లు... సాతాను తంత్రములను మనము ఎరుగనివారము కాము" అని పౌలు మనలను హెచ్చరించాడు (2 కొరింధి 2:11). సాతానుడు ఈ లోకంలో పెక్కుమందిని మోసపరచుచున్నట్లే మనలను కూడ మోసపరచగలడు.

అయితే అతడు పనిచేయు విధానము, అతడుపయోగించు శోధనలు, అస్త్రములు మొదలగునవి మనము ఎరిగియుంటే, అతడు మనలను నాశనము చేయకుండునట్లు తగు జాగ్రత్తలను తీసికొనగలము.

మనలను శోధించడానికి వాడు ఉపయోగించు తంత్రములేమిటి? మన యెదుట నున్న అనేక చెడ్డ మాదిరులను, ప్రభావములను మనపై ఉపయోగిస్తాడు. వీటిలో కొన్ని మన సన్నిహిత మిత్రులు, బంధువులు కావచ్చును. ఈలోకం అంతా చెడు మాదిరులతో నిండియున్నది. అనేకుల చెడు అలవాట్లను మనం ఇట్టే అనుకరించవచ్చును. ఈ లోకంలో యున్న ఆకర్షణీయ శరీరసంబంధమగు క్రియలు, ధనాశ, గర్వము, అహంకారము, అబద్ధ బోధ మొదలగువాటి సంగతి యేమిటి? మనము అనుకొనని అమాయకపు పనులు, అలవాట్లే కొంతకాలానికి అపవాది మనపై ఉపయోగించు తంత్రములు కావచ్చును.

మనలను పెడత్రోవను పట్టించడానికి మోసగించడానికి అపవాది చేయు సంగతులు అనేకములు. అందరు చేయుచున్నారు గదా, నీ జీవితాన్ని నీవనుభవించు, ఇంకా చాల సమయముందిలే, ఈ లోకాన్ని అనుభవించడానికే ఈ లోకంలో మనం ఉన్నామని అనేకసార్లు చెబుతాడు. ఈ రకమైన శోధనలను ఎదుర్కొనుటకు మనం బలవంతులము కావాలి.

అపవాదికంటే దేవుడు బలవంతుడని, ఆయన మనలను ప్రేమించుచున్నాడని, మనతో యుంటూ శోధనను జయించుటకు శక్తి ననుగ్రహించెదనని ఆయన వాగ్దానము చేసెనని మనము జ్ఞాపకముంచుకోవాలి. మనం ప్రార్థించినప్పుడాయన వింటాడని, ఆదరణనిచ్చుటకు ఆయన వాక్యం మనకున్నదని, ఆదరించుటకు మనకు సహోదరులున్నారని, ఈ లోకములోను రాబోవు లోకంలోను మనకు దేవుని ఆశీర్వాదము లన్నియు ఉన్నవని గుర్తుంచుకోవాలి.

ఈ లోకమును దాని నటనయు గతించిపోవునని బైబిలు చెప్పుచున్నది. పాపము వలన వచ్చు జీతము మరణమని కూడ అది చెప్పుచున్నది. సాతాను యిచ్చేదానికి, దేవుడనుగ్రహించు దానికి తారతమ్యమే లేదు. మనం బుద్ధిమంతులమైతే దేవునినే ఎంచుకొని, ఆయననే సేవింతుము.

---

## ఆత్మీయ పరిచర్యలో ఆదర్శ పరిచారకులు
## (Examplary Ministers in Spiritual Ministry)

క్రీస్తు సంఘములు చేయుచున్న ఆత్మీయ పరిచర్య, ఆదర్శ పరిచారకులనే కలిగి ఉండాలని కోరుచు కొన్ని లేఖన భాగములను చూపుటయే యీ వ్యాసముయొక్క ఆశయం.

### ఆదర్శ పరిచర్య

"అయితే నీవు అన్ని విషయములలోను మితముగా ఉండుము. శ్రమపడుము సువార్తికుని పనిచేయుము నీ పరిచర్యను సంపూర్ణముగా జరిగించుము". "కాబట్టి ఈ పరిచర్యను పొందినందున కరుణింపబడినవారమై అధైర్యపడము. అయితే కుయుక్తిగా నడుచుకొనకయు దేవుని వాక్యమును వంచనగా బోధింపకయు, సత్యమును ప్రత్యక్షపరచుటవలన ప్రతి మనుష్యుని మనస్సాక్షి యెదుట మమ్మును మేమే దేవుని సముఖమందు మెప్పించుకొనుచు, అవమానకరమైన రహస్య కార్యములను విసర్జించి యున్నాము" (2 తిమో 4:5, 2 కొరి 4:1, 2).

"మేము మేరకు మించి ఇతరుల ప్రయాస ఫలములలో భాగస్థుల మనుకొని అతిశయపడము. మరియొకని మేరలోచేరి, సిద్ధమైయున్నవి, మావి యైనట్టు అతిశయింపగోరము" (2 కొరి 10:15-16).

"నేనైతే మరియొకని పునాదిమీద కట్టకుండు నిమిత్తము ఆయనను గూర్చి సమాచార మెవరికి తెలియబడలేదో వారు గ్రహింతురనియు వ్రాయబడిన ప్రకారము క్రీస్తు నామమెరుగని చోట్లను సువార్తను ప్రకటింపవలెనని మిక్కిలి ఆశగలవాడనై యుండి ఆలాగు ప్రకటించితిని" (రోమా 10:20, 21).

"ఆయన-ఆత్మకే పరిచారకులకువుటకు మాకు సామర్థ్యము కలిగించి యున్నాడు" "...ఆయన మనలను క్రీస్తుద్వారా తనతో సమాధానపర్చుకొని ఆ సమాధానపరచు పరిచర్యను మాకు అనుగ్రహించెను" (1 కొరి 3:6, 5:18).

## శరీర సంబంధుల పరిచర్య

"అయితే కొందరు అసూయచేతను కలహాబుద్ధిచేతను...శుద్ధ మనస్సుతో కాక కక్షతో క్రీస్తును ప్రకటించు చున్నారు" (ఫిలి 1 : 15-16).

వీరు ఆదర్శ పరిచారకుల ఆత్మీయ పరిచర్యకు ఆటంకము కలిగించుచు కలతలు సృష్టించి శోధించుచున్నారు. "వీరు నిర్భయముగా మీతో సుభోజనము చేయుచు...మీ ప్రేమ విందులలో దొంగ మెట్టుగా ఉన్నారు...సముద్రముయొక్క ప్రచండమైన అలలుగాను, మార్గము తప్పి తిరుగు చుక్కలుగాను ఉన్నారు" (యూదా : 12, 13).

"ఒకనాటి సంతోషము సుఖానుభవమని యెంచుకొందురు. వారు కళంకులును నిందాస్పదులునై తమ ప్రేమ విందులలో మీతో కూడా అన్న పానములు పుచ్చుకొనుచు తమ భోగములందు సుఖించుదురు. వ్యభిచారిణినిచూచి ఆశించుచు, పాపము మానలేని కన్నులు గలవారును...పెనుగాలికి కొట్టుకొనుపోవు మేఘములునై యున్నారు" (2 పేతు 2:13-17). "అప్పుడు శరీరమును బట్టి పుట్టినవాడు ఆత్మను బట్టి పుట్టినవానిని ఏలాగు హింస పెట్టెనో యిప్పుడును ఆలాగే జరుగు

చున్నది." (గల 1:29). "ఏలయనగా తన శరీరమును బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను పంట కోయును . ." (గల 6:8).

పూర్వము దేవుని ప్రజలైన యూదులలో ముఖ్యులైన వారిని, వారి చర్యలను కొన్ని జ్ఞాపకము చేయుదును.

**1. ఆహాబు రాజు : 1 రాజు 21 అ॥**

ఆహాబు పట్టణపువాడును, నీతిమంతుడునైన ఒకడుండెను. అతని పేరు నాబోతు. అతనికి కొట్టిపాటి ద్రాక్షతోట ఒకటి ఉండెను. అది అతని పిత్రార్జితము. అయితే ఈ ఆహాబురాజు దురాశపరుడై వాని కున్న ఆ స్తితో తృప్తిలేక నిరపరాధియైన నాబోతును చంపించి ద్రాక్ష తోటను ఆక్రమించుకొనెను. దేవుడు న్యాయవంతుడు. మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. రాజు చేసిన ఈ ద్రోహానికి వాని వంశమే నశించిపోయెను.

**2. యెహోషాపాతురాజు : 2 దినవృ 17:12, 18:1.**

"యెహోషాపాతు అంతకంతకు గొప్పవాడై యూదా దేశ మందుకోటలను సామాగ్రిని నిలువచేయు పట్టణములను కట్టించెను. తనకు ఐశ్వర్యమును ఘనతయు సమృద్ధిగా కలిగిన తరువాత యెహోషాపాతు ఆహాబుతో వియ్యమొందెను. ఇశ్రాయేలు రాజును యూదా రాజైన యెహోషాపాతును రామోత్గిలాదు మీదికి పోయిరి" (28వ). "దీర్ఘదర్శి హనాని కుమారుడగు యెహూ అతనిని ఎదుర్కొనబోయి, రాజైన యెహోషాపాతుకు ఈలాగు ప్రకటన చేసెను-నీవు భక్తిహీనులకు సహాయము చేసి యెహోవా శత్రువులకు స్నేహితుడవైతివి గదా! అందువలన యెహోవా సన్నిధినుండి కోపము నీ మీదికి వచ్చును" (19 : 2).

"ఇది అయిన తరువాత యూదా రాజైన యెహోషాపాతు

మిక్కిలి దుర్మార్గముగా ప్రవర్తించిన ఇశ్రాయేలు రాజైన అహజ్యాతో స్నేహము చేసెను. తర్షీషునకు పోతగిన ఓడలను చేయించవలెనని యెహోషాపాతు అతనితో స్నేహము చేయగా వారు ఎసోన్గెబెరులో ఆ ఓడలను చేయించిరి. అప్పుడు మారేషావాడును దోదావాహు కుమారుడగు ఎలీయెజరు నీవు అహజ్యాతో స్నేహము చేసికొంటివి గనుక యెహోవా నీ పనులను భంగము చేయునని యెహోషాపాతు మీద ప్రవచన మొకటి చెప్పెను. ఆ ఓడలు తర్షీషునకు వెళ్ళజాలకుండా బద్దలైపోయెను" (20 : 35-37).

యెహోషాపాతు దుష్టుడైన ఆహాబుతో వియ్యమొందినది చాలక మరలా దుర్మార్గముగా ప్రవర్తించిన అహజ్యా రాజుతో కూడా స్నేహము చేసెను. ఎందుకు ఈ కొత్త స్నేహము? తర్షీషునకు పోవు ఓడలను తయారు చేయించి విదేశ యాత్రలు చేయాలని విదేశ వ్యాపారంతో గుట్టలు గుట్టలుగా డబ్బు సంపాదించాలని దురాశగల వాడై రాజుతో కొత్త సంబంధం కుదుర్చుకున్నాడు. అయితే దురాశ గర్భం ధరించి పాపాన్ని కనగా పాపం పరిపక్వమై ఓడలు బల్లున బద్దలైనవి. "మోసపోకుడి దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును" (1 కొరి 15:33).

**3. ఉజ్జియా : (2 దిన వృ 26:15-21).**

అతడు స్థిరపడువరకు అతనికి ఆశ్చర్యకరమగు సహాయము కలిగెను గనుక అతని కీర్తి దూరముగా వ్యాపించెను. అయితే అతడు స్థిరపడిన తరువాత అతడు మనసున గర్వించి చెడిపోయెను...తన దేవుడైన యెహోవా మీద ద్రోహము చేయగా...అతని నొసట కుష్ఠరోగము పుట్టెను...గనుక వారు తడవుచేయక అక్కడనుండి అతనిని బయటకు వెళ్ళగొట్టిరి. ఉజ్జియా తన మరణము వరకు కుష్ఠురోగియై యుండెను".

అపును తన గర్వమే తన శత్రువు. గర్వము నాశనమునకు నడుపును అన్నది ఎంతగా నిజమాయెను?

ఆహాబు, నాబోతు ద్రాక్షతోటను చూచి ఆశించినట్లును, తాను పెట్టని గుడ్లపైపొదిగే కౌజు పిట్టవలెను చేయకూడదు.

ఆత్మీయ పరిచర్యలో పూతపట్టిన ద్రాక్షతోటల వంటి (పరమ 2:15) స్థానిక క్రీస్తు సంఘాలను చెరుపు గుంటనక్కలవలె గుంటలు త్రవ్వకూడదు. అభివృద్ధి చెందుచున్న సంఘాలలోకి నీ మేరదాటి వెళ్ళి వారిని నీ వెంట ఈడ్చుకొనిపోవ ప్రయత్నించకూడదు. తోటలో బలముగా పనిచేయుచున్న సేవకుని పనిని ప్రోత్సహించుట మాని, దోచుకొనుట న్యాయమా? ఆహాబు, నాబోతును చంపుటతో విజయశీలుడు కాలేదు. తన వంశాన్నే నాశనంచేసి కొన్నాడు. "మోసపోకుడి. దేవుడు వెక్కిరింపబడడు. మనుష్యుడేమి విత్తునో ఆ పంటనే కోయును".

దేవుని ఆలయాన్ని పాడుచేస్తే దేవుడు వాని పాడుచేయునన్న లేఖనాన్ని విస్మరించకూడదు (1 కొరి 3:17) "ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను". తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" (1 కొరి 10:11, 12).

ఆత్మీయ పరిచర్యలో ఆత్మను బట్టి పుట్టినవారే ఆదర్శ పరిచారకులు. శరీరమును బట్టి పుట్టినవారు కౌజు పిట్టల్లాగ, గుంటనక్కల్లాగ ఆత్మీయ పరిచర్యకు హింస కలిగించేవారుగా ఉంటారు. వారి కన్ను పూతపట్టిన ద్రాక్షతోటలమీదను, ఎవరో కష్టపడి పెట్టుకున్న గుడ్ల మీదను ఉంటుంది. వారు కష్టపడి పనిచేసి ఆత్మలను సంపాదించలేరు. పొరుగువారు సంపాదించిన ఆత్మలను, కుటుంబాలను, ఇచ్చకపు మాటలతో ఆహాబువలె దోచుకుంటారు.

ఆత్మ సంబంధమైన పరిచర్యను కాపాడుటకు సహాయము చేసి

గుంటనక్కలను పట్టుకోవాలి. తాము పెట్టని గుడ్లను పొదిగే కౌజు పిట్టలను ఎగరతోలాలి. ఆత్మీయ పరిచర్య అన్యాక్రాంతం కాకుండా కాపాడుటయే ఆదర్శ పరిచారకుల పని.

మనస్సాక్షిని చంపుకొని తాను పెట్టని గుడ్లమీద పొదిగి పూదండలు వేయించుకొంటూ ప్రతినిధులమని ప్రచురించుకొనుట ఆదర్శ పరిచర్య అనబడదు.

క్రీస్తు సంఘములు క్రీస్తుకు కలిగిన మనస్సుతో యితరుల కార్యములను చూచుచు, సువార్త వ్యాపకము నిమిత్తము ప్రయాస పడవలెను. అదియే ఆత్మీయ పరిచర్యలో గల ఆదర్శ పరిచారకుల పని (ఫిలి 2:4, 5:20-22).

—పాల్ గూటం, గొల్లవిల్లి.

---

## దేవుని మందిరము

### ( God's Building )

“ప్రతి కట్టడమును ఆయనలో అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయ మగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరుకూడ ఆత్మమూలముగా దేవుని నివాస స్థలమై యుండుటకు కట్టబడు చున్నారు” (ఎఫెసీ 2:21, 22).

సొలొమోను దేవుని మందిరమును నిర్మించుటకు పూనుకొనిన సంఘటన పాతనిబంధనలో నిర్మించబడిన వాటన్నిటికంటె గొప్పది. దేవుని కొరకు ఒక మందిరమును నిర్మించాలనే తలంపు మొదట దావీదునకు కలిగెను. అయితే దావీదు యుద్ధములు జరిగించి రక్తము ఒలికించినవాడు గనుక మందిరమును నిర్మించే తరుణము సొలొమోనుకు ఈయబడునని ప్రవక్తయైన నాతానుతో దేవుడు దావీదునకు తెలియజేసెను (1 దినవృ 28:3). అయినను అతడు మరణించక ముందు

ఆలయమునకు సామాగ్రి పోగుచేయు తరుణము దావీదునకు అనుగ్రహించబడెను.

సొలొమోను నాయకత్వములో ఆ మందిరము గొప్ప వైభవోపేతముగను అందముగను నిర్మించబడెను. మందిరము ముందుగనే చెక్కబడిన రాళ్ళతో నిర్మించబడినను దానిని దేవదారు దూలములతోను పలకలతోను అతడు కప్పించి, మేలిమి బంగారముతో పొదిగించెను. మరియు అది ప్రత్యక్ష గుడారమునకు రెండింతల విస్తీర్ణము గలదియై యుండెను (1 రాజులు 5:1-9:9, 2 దినవృ 2:7). దానిని నిర్మించుటకు 7½ సంవత్సరములు పట్టెను. అది మోరీయ కొండపై నిర్మించబడెను. అబ్రాహాము ఇస్సాకును బలి అర్పించుటకు పూనుకొనిన స్థలం అది. రాజైన సొలొమోను ముప్పది వేలమంది ఇశ్రాయేలీయులను నెలకు పదివేలమంది చొప్పున మందిరపు పనిచేయుటకు నియమించెను. మరియు ఒక లక్షా ఏభైమంది యితరులను అతడు పనికొరకు నియమించెను (1 రాజులు 5:13-15).

మందిర ప్రతిష్ట సమయంలో సొలొమోను చేసిన ప్రార్థన లేఖనాల్లో అతి సుందరమైనది (2 దినవృ 6:3-42). ప్రార్థన అనంతరము అతడు ఇరువదిరెండు వేల యెడ్లను, లక్ష ఇరువది వేల గొర్రెలను అతడు యెహోవా సన్నిధానమందు బలులుగా అర్పించెను (1 రాజులు 8:62). "సొలొమోను తాను చేయు ప్రార్థన ముగించినప్పుడు అగ్ని ఆకాశమునుండి దిగి దహనబలులను ఇతరమైన బలులను దహించెను. యెహోవా తేజస్సు మందిరము నిండ నిండెను. యెహోవా తేజస్సుతో మందిరము నిండినందున యాజకులు అందులో ప్రవేశింపలేక యుండిరి" (2 దినవృ 7 : 1-2). క్రీస్తు పూర్వము 586లో నెబుకద్నెజరు దానిని నాశనము చేయువరకు ఆ దేవాలయము ఇశ్రాయేలు జనాంగమునకు గొప్ప వైభవోపేతమైన మందిరముగా నుండెను.

పాతనిబంధనలోని ఈ గొప్ప మందిరము దేవునికొరకు నిర్మించ బడిన మందిరము లన్నిటికంటె గొప్పదని మనము తలంచవచ్చును: గాని అది కాదు. దానికంటె గొప్ప మందిరమును యేసు దేవుని కొరకు నిర్మించెను. క్రొత్త నిబంధన లేఖకులు దానిని సంఘము అని పిలిచారు. ఈ లోక చరిత్రలో దేవుని కొరకు నిర్మించిన మందిరము లన్నింటిలోను అది ఏకైకమైనది, ఘనమైనది.

ఎఫెసీ పత్రిక రెండవ అధ్యాయములో ఒకడు క్రీస్తుకు వెలుపల నుండుటకును, క్రైస్తవుడై యుండుటకును గల వాడియైన తారతమ్య మును గూర్చి అపొ. పౌలు వ్రాసాడు. వాటిముందు, తరువాతల స్థితిగతులను అతడు వర్ణించాడు. ఉదాహరణకు, ఒకడు క్రైస్తవుడు కాకముందు అతడు మృతుడని పౌలు చెప్పాడు. అతడు ఈ లోక ధర్మము చొప్పున నడుచుచున్నవాడు, అపవాది శక్తిని అనుసరించు చున్నవాడు మరియు అవిధేయుడైనవాడు (ఎఫెసీ 2:1-3). అయితే ఒకడు క్రైస్తవుడయిన తరువాత, అతడు క్షమించబడినవాడని పౌలు చెప్పాడు. అతడు క్రీస్తునందున్నవాడు, కృప వలన రక్షింపబడినవాడు (ఎఫెసీ 2:4-10). పౌలు ఈ తారతమ్యాన్ని ముగిస్తు, యూదులకేమి అన్యజనులకేమి క్రీస్తులో గల ఏకత్వాన్ని గూర్చి అతడు చెప్పాడు. అట్లు చేయుటలో అతడు సంఘాన్ని ఒక పట్టణమువలెను (2 : 19), ఒక దేవాలయము వలెను పోల్చి చెప్పాడు (2:20, 21). సంఘమును దేవుని మందిరముగా అతడు వర్ణించిన విధానము పరిశుద్ధాత్ముడు మనకిచ్చిన అతి మనోహరమైన వివరణయై యున్నది. "కాబట్టి మీరిక మీదట పరజనులును పరదేశులునై యుండక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారు. క్రీస్తు యేసే ముఖ్య మైన మూలరాయియై యుండగా, అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద కట్టబడి యున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో

చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరుకూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2:19-22).

అలంకారపూరిత భాషలో సంఘమును పరిశుద్ధాత్ముడు ఒక మందిరమని వర్ణించెను. ఈ భావనాలంకారము ద్వారా సంఘమును పరికించితే దానియొక్క విశిష్ట తత్వము మనకు తెలియనగును.

## మానవ మందిరము

పాత నిబంధనలోని దేవాలయమువలె గాక క్రొత్త నిబంధనలోని మందిరము ప్రజలలో సమకూడినట్టిది. ఈ మందిర నిర్మాణములో ప్రతి క్రైస్తవుడు ఒక సామగ్రివలె యున్నాడు. క్రైస్తవులైన అన్యజనులు ఇకమీదట పరజనులును పరదేశులును గాక, పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటివారునై యున్నారని పౌలు చెప్పాడు. ఈ గృహమునకు యేసుక్రీస్తే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద అది కట్టబడి యున్నది. క్రైస్తవులు (యూదులేమి అన్యజనులేమి) దేవుని మందిరమగుటకు చక్కగా అమర్చబడి యున్నారని అతడు చెప్పాడు. 1 పేతురు 2:5లో పేతురు యిదే అలంకారాన్ని వినియోగించాడు: "మీరును సజీవమైన రాళ్ళవలె నుండి, ఆత్మసంబధమైన మందిరముగా కట్టబడుచున్నారు".

సంఘము ఒక మందిరమై యున్నది. క్రైస్తవులైన ప్రజలతో సమకూడిన ఆత్మీయ మందిరము అది. ఆ మందిరములో ప్రతి క్రైస్తవుడు ఒక ఆత్మీయ రాయియై యున్నాడు. క్రైస్తవు లందరు సజీవమైన రాళ్ళవలె ఒకరితో నొకరు పరిశుద్ధాత్మయొక్క శక్తి వలన చక్కగా అతుకబడి అలంకారరీతిగా మందిరమని పిలువబడినారు. లోకములో యున్న మతశాఖ లన్నియు ఒక సార్వజనిక సంఘ మగు

సని క్రొత్తనిబంధన బోధించుచుటలేదు. సరిగదా ప్రతి స్థానిక సంఘము దానికదే సర్వసంపూర్ణత కలిగియున్నదని, అది సార్వజనిక సంఘము యొక్క స్థానిక స్వరూపమని బోధించుచున్నది. లోకమందంతట యున్న వ్యక్తిగత క్రైస్తవులతో సార్వజనిక క్రీస్తు సంఘము తయారైనది. ప్రతివాడు ఈ ఆత్మీయ మందిరములో సజీవమైన రాయివలె యుంటూ ప్రభుని సేవించును.

సంఘమును ఒక భౌతిక భవనమనిగాని, గుడియని గాని ఎప్పుడు మనము తలంచరాదు. క్రొత్తనిబంధనలో ఆరాధన స్థలమును (గుడిని) గూర్చి ఎక్కడా ఒక్క మాటకూడ చెప్పబడలేదు. క్రైస్తవులు క్రమము తప్పక ఆరాధనకు కూడుకోవాలని హెచ్చరింపబడిరి (హెబ్రీ 10 : 25). అంటే ఈ హెచ్చరికలో కూడుకొనే స్థలము ఇమిడియున్నది. అయితే ఆ స్థలము ఒక గృహముగాని, ఏదైనా విశాల ప్రదేశముగాని, సమావేశమగుటకు అనుకూల ప్రదేశముగాని కావచ్చును. అయితే ఆరాధన స్థలమునుగూర్చి క్రొత్తనిబంధనలో ఎక్కడా వివరణ ఇయ్యబడలేదు. ప్రతి స్థలములోనుయున్న క్రైస్తవుల అనుకూలతకు యిది విడిచిపెట్టబడి యున్నది. దేవుని మందిరమైన సంఘము ఒక ప్రదేశములో యున్న క్రైస్తవుల సమూహమేగాని, సమావేశమయ్యే స్థలము కాదని మనం గ్రహించుకోవాలి.

క్రైస్తవులు తాము దేవుని మందిరముగా గమనించుకోవాలి, ఆ మందిరములో ప్రతి క్రైస్తవుడు ఒక ప్రాముఖ్యమైన భాగము. క్రైస్తవుడు వెళ్ళుచుండగా, దేవుని మందిరమైన సంఘములో సజీవమైన రాయి వెళ్లుచున్నాడని యితరులు చెప్పుకోవాలి. క్రైస్తవులను బట్టి లోకస్థులు సంఘాన్ని లెక్క కడతారు గాని వారు ఆరాధనకు కూడుకొనే గుడినిబట్టి కాదు. దేవుని మందిరముగా మనం జీవించాలి. క్రీస్తు సంఘములో మన స్థానమునకు సరిపడు రీతిగా జీవించాలి.

## సజీవ మందిరము

సంఘము మానవ మందిరమైనందున అది సజీవమందిరమనుట వాస్తవము. పాతనిబంధనలో సొలొమోను నిర్మించిన మందిరము నిర్జీవమైన రాళ్ళతోను దేవదారు చెక్కలు, బంగారము, వెండి, వెల గల రాళ్ళతోను నిర్మించబడెను. అయితే నేటి దేవుని మందిరము సజీవమైన రాళ్ళతో తయారుచేయబడి యున్నది.

సంఘమును ఒక సంస్థగా పౌలు ఎన్నడు వర్ణించలేదు. సరిగదా క్రైస్తవులతో సమకూడి సజీవమై దినదినాభివృద్ధి జెందుచున్న జీవిగా దాన్ని అతడు వర్ణించాడు. పౌలు వ్రాసిన మందిరమునకు పైకప్పు లేదు. క్రైస్తవులే దాని గోడలు. యేసుక్రీస్తు ముఖ్యమైన మూల రాయియై యుండగా అపొస్తలులు ప్రవక్తలు దాని పునాది. క్రీస్తే ఈ మందిరమును అమర్చినవాడు. ప్రజలు క్రీస్తులోనికి మార్పు జెందు చుండగా, వారు ఈ మందిర గోడలకు చేర్చబడుదురు. ఒకడు క్రైస్త వుడైన ప్రతిసారి ఈ మందిరము పైపైకి లేచుచునే యుండును.

అపొ.కా.2లో లూకా యిట్లు వ్రాసాడు: "కాబట్టి అతని వాక్యము నంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి, ఆ దినమందు ఇంచుమించు మూడు వేల మంది చేర్చబడిరి" (41). రెండు అధ్యాయముల తరువాత "వాక్యమును వినిన వారిలో అనేకులు నమ్మిరి. వారిలో పురుషుల సంఖ్య ఇంచుమించు అయిదు వేలాయెను" అని అతడు వ్రాసాడు (అపొ.కా. 4:4). కొద్ది కాలములోనే దేవుని మందిరము మూడువేల సజీవ రాళ్ళనుండి అయిదు వేలు వరకు పెరిగెను. నాటినుండి నేటి వరకు దేవుని మందిరము అభివృద్ధి జెందుచునే యున్నది. గత సంవ త్సరముకంటె అది ఇప్పుడు ఇంకా పెద్దది. యేసు వచ్చువరకు అది అభివృద్ధి జెందుచునే యుండును.

క్రైస్తవులు సజీవమైన రాళ్లు అని పేతురు వర్ణించాడు (1

పేతురు 2 : 5). పౌలు వారిని సజీవమైన యాగము అని వర్ణించాడు (రోమా 12:1). గనుక దేవుని మందిరమంతయు సజీవమైనదే. లేఖనములలో తండ్రియైన దేవుడు జీవముగల దేవుడని పిలువబడెను (1 థెస్స 1:9). బైబిలు సజీవమై బలముగలదై యున్నది (హెబ్రీ 4:12). పేతురు ప్రకారము యేసు సజీవమైన రాయియై యున్నాడు (1 పేతురు 2:4). క్రైస్తవులకున్న నిరీక్షణ యదార్థమైనది; నిర్భయమైనది. అందువలన అది జీవముతో కూడిన నిరీక్షణయై యున్నది (1 పేతురు 1:3). క్రైస్తవులు విధేయత చూపుటద్వారా ప్రవేశించిన మార్గము నూతనమైనదియు, జీవముగలదియునైన మార్గము (హెబ్రీ 10:20). నిత్యుడైన యేసుక్రీస్తు మన పక్షమున పరలోకములో విజ్ఞాపన చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు (హెబ్రీ 7:25). మరణము కూడ క్రీస్తునందలి మన జీవమును తీసివేయలేదనే వాగ్దానము మనకున్నది. ఏలయనగా మనము మరణించినను తిరిగి బ్రదుకుదుము (యోహాను 11 : 26).

క్రైస్తవుడు ఒక సంస్థలో భాగముకాదు. అతడు సజీవమై అభివృద్ధి జెందుచున్నదైన ఆత్మీయ భవనములో ఒక సజీవమైన రాయి. దేవుని మందిరము దినదినము అభివృద్ధి జెందుటకు అందముగా చేయుటకు మనము పనిచేయుచున్నాము. మిగతా క్రైస్తవులతో కలసి పెరుగుటకు ఎన్నడు ఆగిపోని భవనముగా మనము ఒండొరులతో చేర్చబడి యున్నాము. మనము క్రీస్తులోనికి ఒక ఆత్మను నడిపించునప్పుడు దేవుని మందిరముతో సజీవమైన మరొక రాయిని చేర్చుచున్నాము. అదేవిధముగా ఏకారణము చొప్పునైనను క్రైస్తవుడైన వానిని పడగొట్టిన యెడల దేవుని మందిరములోని ఒక సజీవమైన రాయిని కూలద్రోసినవార మగుదుము. ప్రతి క్రైస్తవుడు మిగతా క్రైస్తవు లందరితోను జతపర్చబడి యున్నాడు. మనము సమిష్టిగా దేవుని మందిరమగునట్లు ఒకరితో నొకరు, ఒకరికొరకు జీవించుదుము.

## అంతరంగఆత్మ నివసించు మందిరము

మానవులు జీవించడానికి యిండ్లు నిర్మించబడతాయి. దేవుని యిల్లుకూడ అల్లే. ఆయన ఆత్మీయ మందిరములో ఆయన ఆత్మ జీవించును. పౌలు ఇట్లన్నాడు: "ప్రతి కట్టడమును ఆయనలో అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధ దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవుని నివాసస్థలమై యుండుటకు కట్టబడుచున్నారు" (ఎఫెసీ 2:21, 22). పౌలు కొరింథీయులకు ఇట్లు వ్రాసాడు: "మీరు దేవుని ఆలయమై యున్నారనియు, దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడుచేసిన యెడల దేవుడు వానిని పాడుచేయును" (1 కొరింథీ 3:16).

దేవునికి పరలోకములో ఎట్లు నివాసస్థల మున్నదో అట్లే భూమిమీదకూడ నివాసస్థల మున్నది. సంఘమే భూమిమీద ఆయన నివాస స్థలము. ఆత్మద్వారా ఆయన కుటుంబముతో సంచరించును, కలసికొనును. సంఘము భూమిమీద గోచరమగు దేవుని పాత్ర. దేవుడు సంఘములో జీవించుచు సంఘముద్వారా పనిచేయును. సంఘము నిర్జీవమైనదైతే నిష్ప్రయోజనమైనదగును. నిజసంఘము పారంపర్యాచారములతో కలుషితమైన పురాతన నిర్జీవమైన సంస్థ కానేకాదు. దేవుని ఆత్మ దానిలో నివసించును! ఈ లోకంలో దేవుడు జీవించుటకు క్రీస్తు దానిని దేవుని యిల్లుగా నిర్మించెను.

రోమా సామ్రాజ్యమంతయు దేవతార్చనతో కూడిన గుడులతో నిండియుండెను. ఎఫెసులో అర్తెమి దేవియొక్క గుడి యుండెను. యెరూషలేములో యూదుల దేవాలయముండేది. మరియు రోమా సామ్రాజ్య మంతటిలోను యూదుల సమాజ మందిరము లుండేవి. అయితే దేవుని మందిరమే ఈ మందిరము లన్నిటికంటె అందమైనది,

ఘనమైనది. ఆయన ఆలయము చేతులతో చేయబడినది కాదు, దేవుడే దానిని చేసెను. మహిమలోను ఘనతలోను అది మానవ నిర్మిత మందిరము లన్నిటికంటె ప్రకాశమానమైనది. ఏలయనగా దేవుడే దానిలో నివసించుచున్నాడు. యేసుక్రీస్తు ముఖ్యమైన మూలరాయి మైయుండగా, ప్రవక్తలు అపొస్తలులు వేసిన పునాదిమీద అది నిర్మించబడగా, క్రొత్తగా క్రైస్తవుడైన ప్రతివానిని దేవుడే దానితో దినదినము చేర్చును. ఇండియా, ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియా, రష్యా దేశాలలో ప్రజలు క్రైస్తవులగుచుండగా ఈ మందిరము దిన దినము పైకి లేచుచునే యున్నది. ఈ ఆత్మీయ మందిరములో దేవుడు తన ఆత్మ ద్వారా నివసించును!

ఈ సత్యము మన హృదయాలకు గొప్ప సవాలు కావాలి; ఈ లోకంలో మనము దేవుని మందిరమై యున్నాము! జ్ఞానముతోను, పరిశుద్ధతతోను, విశ్వాసముతోను, విధేయతతోను జీవించుదుము గాక!

## ముగింపు

ఎఫెసీ 2:19-22లో పౌలు గొప్ప మహిమగల సత్యాన్ని పలికాడు. సంఘము దేవుని మందిరము. అది మానవ మందిరము, జీవము గల మందిరము, ఆత్మ నివసించు మందిరము.

ధనవంతు డొకడు ఒక బిల్డింగు కాంట్రాక్టరుకు కొంత డబ్బు యిచ్చి, తన కొరకు ప్రశస్తమైన యిల్లును నిర్మించుమని కోరెను. అయితే ఆ కాంట్రాక్టరు చవుకబారు సామాగ్రితో ఆ యింటిని నిర్మించి పైపై రంగులు చక్కగా వేసి, ధనవంతునికి యిల్లు పూర్తి చేసి అప్పగించెను. ఆ ధనవంతుని అన్నివిధముల మోసగించి అతని డబ్బు కాజేసినందుకు అతడు లోలోపల సంతోషించెను. అయితే అన్ని పూర్తి అయిన తరువాత యజమాని ఆ యిల్లును ఆ కాంట్రా

క్టరుకే బహుమతిగా యిచ్చెను! ధనవంతుడైన యజమానిని మోస గించి కంట్రాక్టరు తన్ను తానే మోసగించుకొనెను.

మనమొక యిల్లు నిర్మించాలని దేవుడు ఆజ్ఞాపించలేదు. మనమే ఆయన యిల్లుగా యుండుటకు పిలువబడితిమి! క్రీస్తులోనికి వచ్చి ఆయన మందిరముగా యుండుటకు మనము నిరాకరించిన యెడల, మానవులకు దేవుడిచ్చిన గొప్ప తరుణాన్ని నిరాకరించి మనలను మనమే మోసగించుకొనువారమగుదుము. మనము దేవుని యింటిలో ప్రవేశించి ఆయన యింటివారికి తగిన రీతిగా జీవించని యెడల మనలను మనమే మోసగించుకొందుము. సొలొమోనువలె దేవునికి ఒక మందిరమును మనము నిర్మించలేము. ఏలయనగా దేవుని వాక్యము ద్వారా దేవుని ఆత్మవలన సంఘము నిర్మించబడినది. అయితే సువార్తకు విధేయులగుటవలన మనము దేవుని మందిరము కాగలము. మరియు మన సజీవ రాళ్ళను దినదినము మెరుగుపెట్టుచు క్రీస్తుకొరకు జీవించగలము. నీవు దేవుని మందిరములో ఒక భాగముగా యున్నావా?

—ఎడ్డీ క్లోర్. (TFT)

---

## మనము కాదనలేని సత్యము

(గత సంచిక తరువాయి)

యేసుప్రభువువారు పరలోకమునకు ఆరోహణమైన తరువాత, యెరూషలేము యొక్క దుస్థితిని ఆయనను సిలువవేసిన ప్రజలే కన్నులారా చూచినారు. ప్రభువువారు ఆరోహణమై 41 సంవత్సరములు అయినది. అప్పుడు యెరూషలేములో పస్కా పండుగను ఆచరించు నిమిత్తము 15 లక్షల మంది యూదులు యెరూషలేము పట్టణమునకు తరలివచ్చినారు. అదే సమయంలో రోమా సైన్యాధిపతియైన వెస్పేషియన్ వచ్చి ఆ పట్టణమును ముట్టడి చేసినాడు. మరియు అతని

కుమారుడైన టైటస్ యెరూషలేమును ముట్టడి వేసినవారిలో ఒక అధిపతి (Roman General). సైన్యముతో ఈ జనరల్స్ వచ్చి ముట్టడి వేసినారు. పట్టణము చుట్టూ లోతైన కందకము త్రవ్వినారు. ఆహార పదార్థములేవియు పట్టణములోనికి రాకుండా అరికట్టినారు. 15 లక్షల మంది పట్టణ ప్రజలకు మంచినీరు కూడ లేకపోయినది. ప్రజానీకము ఆకలితో అలమటించినారు. తినుటకు ఆహారము లేక ఎలుకలను, పందికొక్కులను, వారి గృహములలో పెంచిన కుక్కలను, పిల్లులను సహితము కాల్చుకొని తిన్నారు. క్షామము భరించలేక వారు చివరకు నరమాంస భక్షకులుగా మారినారు. కన్నతల్లులు వారు కనిన బిడ్డలను క్రూరముగా చంపి ఆ పిల్లల మాంసముతో ఆకలి తీర్చు కున్నారు. రోమా సైనికులు పట్టణములోనికి వచ్చి దినమునకు 500 మందిని, 600 మందిని బంధించి పట్టణపు గోడలకు సిలువలు నిలిపి వాటికి బంధించి యుంచినారు. ఆ దినములలో సిలువలు రోమా ప్రభుత్వము యొక్క పద్ధతి. కాళ్ళు, చేతులు సిలువకు కట్టి చంపకుండ వారిని వ్రేలాడ కట్టినప్పుడు పక్షులు ఆ సిలువకు అంటగట్టిన వారిని పీకుకుంటూ తిన్నవి. బైబిలులో ఈ సత్యము 3000 సంవత్సరముల ముందే ప్రవక్తయైన మోషే ద్వితీయోపదేశకాండము 28వ అధ్యాయము 53వ వచనములో ప్రవచించినారు. బైబిలు ప్రవచనములతో నిండి యున్న పరిశుద్ధ గ్రంథమని చదువరులు గ్రహింతురుగాక. ఈ ఘట్టము ప్రవక్తయైన మోషే వ్రాసిన విధముగా ప్రభువువారు 41 సంవత్సరముల ముందే ఒలీవల కొండపై కన్నులారా చూచి ఏడ్చినారని లూకా సువార్త 19 : 41 లో మనము చదివి గ్రహించగలము. ఈ దారుణమైన దుస్థితి కాకుండా 1943 వ సంవత్సరములో యూరపు ఖండము నందు నివసించి ప్రపంచమును కదిలించిన జర్మన్ కార్పోరల్ హార్ హిట్లర్ తన దేశమైన జర్మనీలోగల యూదులను 40 లక్షల మందిని

పట్టుకొని హతము చేయుటకు ఒక జనరల్‌ను నియమించినాడు. అతని పేరు ఎడోల్ఫ్ అయిక్‌మన్. యూదులకు స్వరాజ్యమిస్తానని మోసపు మాటలు చెప్పి లారీలమీద ఎక్కించి దూరముగా కాన్ సెంట్రేషన్ కేంప్ అను స్థలమునకు తీసికొని పోయినాడు.

"వాని రక్తము మా మీదను, మా పిల్లల మీదను ఉండును" గాక అని మత్తయి సువార్త 27వ అధ్యాయము, 25వ వచనములో యూదులు అన్న మాటల ప్రభావము యివ్విధముగా పరిణమించినది.

జర్మనీ నియంత యగు హర్ హిట్లర్ యూదుల 40 లక్షల సమూహములను హతమార్చుటకు కాన్‌సన్‌ట్రేషన్ కేంప్స్ ఏర్పాటు చేసి గంభీరమైన పొయ్యిలను గంధకముతో వెలిగించి వారు అందులో దహించబడుటకు కుటుంబముల వారిగా తల్లి దండ్రులను వారి కుమార్తెలును, వారి కుమారులును నగ్న శరీరులుగా చేసి ఆ పొయ్యిలలోనికి నడిపించినాడు. ఈలాగు యూదులను అనగా 40 లక్షల సమూహములను నాశనం చేయుటకు ఎడాల్ఫ్ ఐక్‌మన్ అనే వానిని ఏర్పాటు చేసాడు. యూద కుటుంబములు వారి కుమార్తెలు, కుమారులు ఆ గంధకపు పొయ్యిలలోనికి వెళ్ళడానికి జంకుతున్న స్త్రీ పురుషులను తల్లులను, పిల్లలను మరతుపాకులతో వారి కడుపులను పేల్చి వారి పొట్టలు తూట్లు తూట్లుగా పేల్చి నడిపించాడు. ఈ ఘోరమైన హింసాకాండ మానవ ప్రపంచము ఊహించలేనిది.

దేవుడైన ప్రభువును చంపినవారి కుటుంబములకు సంభవించిన ఘోర శ్రమలు ఇవి.

ఆ కాన్‌సెంట్రేటన్ కేంప్ సమయములో నేను ఒక యోధునిగా పనిచేసినవాడను. ఎడాల్ఫ్ అయిక్‌మన్ పెద్దపెద్ద పొయ్యిలను (ovens) గంధకముతో వెలిగించి భగభగ మండజేసినాడు. లారీలలో

తీసికొనివచ్చిన యూదుల కుటుంబములను-తల్లి, తండ్రి, అన్న, చెల్లెలు అనే వివక్షత లేకుండా వారు ధరించిన వస్త్రములు వూడదీని, 'ఆ పొయ్యిలోనికి నడువుడి' అని ఆజ్ఞ యివ్వగా యూద ప్రజలు భయభ్రాంతులయినారు. వారు వస్త్రహీనులై ఆ మంటలలోనికి నడుచుటకు సంకోచించుచుండగా మరతుపాకులతో వారి ఉదరములలో తూట్లు చేయుచుండగా, వారు మంటలలో పడి నశించినారు. అయిక్ మన్ ఆజ్ఞానుసారముగా స్త్రీ పురుషుల వివక్షత లేకుండా ఆ మంటలలో ఒకరిపై ఒకరు పడి కాలిపోయిరి. యేసుప్రభువువారు ఒలీవ కొండపై అప్పుడు ఈ ఘోర దృశ్యమును చూచినారు. ఆయన ఏడ్చుటకు కారణమేమి!

హార్ హిట్లర్ అనేవాడు వోడిపోయి తన బలమైన రివాల్వర్‌తో అనగా చిన్న తుపాకీతో నోటి అంగటికి గురిపెట్టుకొని పేల్చుకొని పడి చనిపోయినాడు. ఈ కథనము అంతయు ఇంగ్లాండ్ ప్రధాన మంత్రియైన విన్‌స్టన్ S చర్చిల్ వ్రాసిన ఆరు గ్రంథములలో మనము చూడగలము. చర్చిల్ వ్రాసిన ఆరు గ్రంథములు రెండవ ప్రపంచము నుండి అంతమువరకు వివరించి వ్రాసినవి. హిట్లర్ యొక్క జనరల్స్ దాదాపు ఎనమండుగురిని ఇంటర్నేషనల్ జ్యూరీ ఉరితీసి చంపారు. ఈ ఉరిశిక్ష 1944-1946 సంవత్సరములలో జరిగినది.

ఎడాల్ఫ్ అయిక్‌మన్ అనేవాడు పది సంవత్సరములు దొరకకుండా మారువేషముతో సంచరించాడు. తరువాత పట్టుబడ్డాడు. ఇంటర్నేషనల్ జ్యూరివారి చేత విమర్శింపబడి ఉరిస్తంభమునకు పోతూ లాంగ్‌లివ్ ఆస్ట్రియా అని కేకలు వేసి ఉరిస్తంభముమీద ఉరి తీయబడి చనిపోయినాడు.

ముసలివారు మోకరించి దండము పెట్టుకొనుచుండగా, సుత్తులతో వారి తలలపై మోది ఆ సుత్తులతో వచ్చిన మెదడును పైకి

పూడ్చినారు. ఈ హింసాకాండ ప్రభువువారు ఆయన పరిశుద్ధ నేత్రములతో చూచిన ఘోరమైన దృశ్యము. యేసుక్రీస్తు ప్రభువువారి యొక్క చరిత్ర ఒక్క బైబిలులోనే వ్రాయబడలేదు. రోమా చరిత్రకారుడు ప్లిని (Pliny) అనువతడు, చక్రవర్తియైన ట్రేజన్ (Trajan) కు, "క్రైస్ట్ అండ్ క్రిష్టియన్స్" లో వ్రాసినారు.

జోసిఫస్ (Josephus) అనే చరిత్రకారుడు యేసుప్రభువు పిలాతుచేత సిలువ వేయబడుట వ్రాసినారు. బబులోను గ్రంథము, తాల్మడ్ Talmud గ్రంథములలో పొంతు పిలాతు చేత, యేసు ప్రభువు సిలువ మరణమునకు అప్పగింపబడుట వ్రాయబడి యున్నది. ఆ గ్రంథములు బైబిలులో వ్రాయబడిన విషయములు సత్యములని సాక్ష్యమిచ్చుచున్నవి. జర్మనీ దేశములో యూద ప్రజలు ఆలాగు కాల్చబడుచుండగా ధైర్యము వహించిన ఫొటోగ్రాఫరులు రహస్యముగా ఫొటోలు తీసినారు. Royal Indian Navy లో పనిచేసిన వాడనైననేను, ఆ ఫొటోలలోని దృశ్యములు నాకండ్లతో చూచినాను.

ఇంతకీ ప్రభువైన యేసువారియొక్క వస్త్రములు పంచుకున్నారు గదా! పైనుండి క్రిందికి వేయబడిన అంగీకొరకు చీట్లు వేసుకున్నారు గదా! యేసుప్రభువువారు ఆరోహణమైనప్పుడు వస్త్రములతో ఆకాశములో ఆరోహణమయినట్లు మనము చూస్తాము. ఆ వస్త్రము ఎలా వచ్చినది? యేసుప్రభువువారు పునరుత్థానుడైనప్పుడు ఆయన శరీరము మహిమ శరీరము. ప్రభువుయొక్క వస్త్రములు మహిమ వస్త్రములు. కొరింథీయులకు వ్రాసిన పత్రికలో పరిశుద్ధుడైన పౌలు, "మనము దిగంబరులుగా వున్నను, వస్త్రములతో వుందుము" అని వ్రాసినారు. కాబట్టి యేసుప్రభువువారి శరీరము మహిమ శరీరము. ఆయన ధరించిన వస్త్రములు మహిమ వస్త్రములు. యేసుక్రీస్తు ప్రభువువారు లోకమంతట స్వీకరించబడి ఆరాధింపబడుచున్న దైవము. ఈ దైవము పర

లోకమునుండి భూలోకమునకు వచ్చిన కారణము లోకపాపములను మోసికొని పోవుటకే.

ఈ దైవములోని ప్రత్యేకత ఏమనగా, ఆయన స్త్రీతో సంసారము చేయలేదు. యేసుప్రభువు "నాలో పాపమున్నదని ఎవడు స్థాపించును?" అని సవాలు చేసారు. పాపముతో పట్టుబడిన స్త్రీలను క్షమించుట పాపక్షమాపణ ప్రకటించుట తప్ప మరేమియు ఆయనలో చూడలేము. ఈ పరిశుద్ధ దైవములో దీనిని తప్ప ఈ లోకము మరేమియు చూడలేదు. (సమాప్తము)

—టి. జాన్. S. ఫ్రెడరిక్, పెద్దాపురం.

---

# సువార్త బోధకుడెవరనగా....

## ( A Gospel Preacher is... )

అన్నిటికంటె ముందుగా సువార్త బోధకుడొక సామాన్య క్రైస్తవుడు. ధరించుకొనడానికి ప్రత్యేక దుస్తులుగాని, బిరుదులుగాని అతనికి లేవు. మిగతా క్రైస్తవులు అపవాదితో అనుదినము జరిగించు పోరాటమునే అతడును పోరాడును. ఆదివారమైనను అతనికి రోగము సంభవింపవచ్చును. బుధవారం వచ్చేసరికి అతడు సొమ్మసిల్లవచ్చును. మనకు కావలసి వచ్చినప్పుడే అతడు రోగియై యుండవచ్చును.

బోధకుడు దేవుని వాక్యమును ప్రకటించువాడు. అతడు యేసును గూర్చియు ఆయన ప్రేమను గూర్చియు ప్రకటించును. కొందరికి ఆ సమాచారము పాతదై పోయినట్లు అగుపడును గాని అతనికైతే ఎడారిలో వర్షించే వర్షమువలె నూతనంగా యుండును. మానవుల హృదయాల్లో దేవుని మాటను నాటుటకు అతడు ఆశించును. అతడేమి బోధించుచున్నాడో ఎట్లు బోధించుచున్నాడో యను దానిని గూర్చి

చాల జాగ్రత్త వహించును. ఒక్కొక్కసారి అతడు నాటిన విత్తనములు మొలకెత్తి ఫలములు ఫలించుట చూచి అత్యానందభరితుడగును.

సువార్త బోధకుడు సహోదరులను హెచ్చరించువాడు. నిత్య జీవానికి నడుపు సంకుచితమును ఇరుకైన మార్గమును అతడు వారికి చూపించ ప్రయత్నించును. మార్గములో అతడు అనేకులను ప్రోత్సహించును, కొందరిని అగ్నిలోనుండి లాగి రక్షించును. అట్లు చేయుటలో పదేపదే దేవుని వాక్యము నొద్దకు వెళ్లును. దానినుండి తనకును యితరులకును కావలసిన ప్రోత్సాహాన్ని పొందును.

సువార్త బోధకుడు దేవుని సత్యమును పరిరక్షించువాడు. కొన్ని సందర్భాల్లో ఉక్కు హస్తమును కలిగినవానిగ యుండును. అతడొక్కొక్కసారి ఏకాకివలె నగుపడును గాని అతడు ఎన్నడును ఏకాకి కానేకాడు. బోధకుడు అబద్ధ సిద్ధాంతాన్ని, అసత్య బోధకులను ఖండించువాడై యుంటాడు. లేఖనములవలన కలుగు శక్తిని బట్టి అతడు గందరగోళమును సృష్టించువారిని అరికట్టును. అట్లు చేయుటకు అతనికి బైబిలు పఠనము, ధ్యానము, ప్రార్థన ఎక్కువ అవుసరము. ఈ విషయములో క్రీస్తుకూడ అతనికి యేమి తక్కువ చేయరని అతడెరుగును.

సువార్త బోధకుడు కేవలము స్వప్న సౌధములను నిర్మించువాడు కాడు. అతని చేతిలోను హృదయములోను దేవుని నమూనాయగు వాక్యమున్నది. అతడు దానిని సరిగ విభజించును. ప్రభువు మరల వచ్చువరకు అతడు సిగ్గుపడని పనివానిగ యుండును.

సువార్త బోధకుడు దేవుని వాక్యపు విద్యార్థియై యుండును. దానినుండి నూతన స్ఫూర్తిని పొందుటకుగాను దినదినము దానిని పఠించును. తత్ఫలితముగా అతడు దినదినము నూతన పరచబడును. అతడు చేయు ప్రతి ప్రసంగము, ఉపదేశించు ప్రతి పాఠము బైబిలు ద్వారా వేశము వలన కలిగినదని అతనికి మరింత రూఢియగును. ప్రజల జీవి

శాల సది సరిదిద్దుటను అతడు గమనించును. అతడు దానిని ఎంత అభ్యసిస్తాడో అంత తన జీవిత ప్రయోజనమును గుర్తించును. మానవుని యెడల దేవుని సంకల్పమే అతని సంకల్పమగును.

— రోయల్ఫ రఫ్‌నర్ (IGT).

---

## సంక్షిప్త వార్తలు

1995 జనవరి మొదటి తేదీ ఆదివారమునాడు కాకినాడ సత్యవాణి భవనములో ఆరాధన కార్యక్రమము ఘనముగా జరిగెను. ఆ రోజు 350 మంది హాజరై దేవుని స్తుతించిరి. ఆరాధన అనంతరము జరిగిన ప్రేమ విందులో మరికొందరు పాల్గొని ఆనందించిరి.

జనవరి 11వ తేదీ బుధవారంనాడు గూటం అప్పారావుగారి మనుమడును, Bro. ఎజ్రా శాస్త్రిగారి కుమారుడైన సునీల్‌కు మాధురితో గొప్ప వైభవోపేతముగా వివాహము జరిగెను. కాకినాడ సత్యవాణి భవనంలో జరిగిన ఈ శుభ కార్యక్రమానికి అనేక వందల బంధు మిత్రులు పట్టణ ప్రముఖులు హాజరై నూతన వధూవరులనాశీర్వదించిరి.

జనవరి 20వ తేదీ శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలంలోని వెంకటాపురంలో క్రీస్తు కొరకు నిర్మించబడిన ఆరాధనా మందిరమును సోదరులు జాషువా గూటంగారు రిబ్బను కత్తిరించి తెరచిరి. తదనంతరము దేవుని ఆలయమైన సంఘమునుగూర్చి దాని విశిష్టతనుగూర్చి గంభీరోపన్యాసము చేయగా 13 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. వారికి బాప్తిస్మమిచ్చుటలో సోదరులు T.Ch. ఫ్లెమింగ్స్‌గారు సహాయపడిరి. ఆ కార్యక్రమానికి పి.జె.కృపాలిన్, కె. శాంతారావు, డి. ఇశ్రాయేలురాజు, S. యేసురత్నంగార్లు తదితరులు హాజరై జయప్రదముగావించిరి. వెంకటాపురంలోని నూతన ఆలయంకొరకు G. నాగేశ్వరరావ్‌గారి కృషి బహు ప్రశంసనీయమైనది.

జనవరి 28, 29, 30 తేదీలలో జాషువా గూటంగారు బెంగుళూరు పట్టణములోని మత్తికెరె ఏరియా క్రీస్తు సంఘములో పనిచేసిరి. బహిరంగ సువార్త కూటములు, బైబిలు తరగతులు ఆ మూడు దిన

ములలోను నిర్వహించబడెను. మత్తికెరె సంఘముతో సోదరులు N. సామ్యూల్ గారు పనిచేస్తు ఆ సంఘమును స్వయంపోషక సంఘముగా తీర్చి దిద్దారు. మరియు మత్తికెరె క్రీస్తు సంఘమునుండి వెలువడుచున్న "ఆత్మ బంధువు" అను మాస పత్రిక రెండో సంవత్సరము యొక్క మొదటి సంచికను జాషువాగారు విడుదల చేసిరి. మరియు మత్తికెరె క్రీస్తు సంఘము జనవరి 29 నుండియే ఒక ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సును ప్రారంభించారు. దాని మొదటి పాఠములను కూడ జాషువాగారు విడుదల చేసారు.

ఫిబ్రవరి 7వ తేదీనాడు మణుగూరు (ఖమ్మం జిల్లా) లో నిర్మించబడిన ఆలయమును తెరుచుటకు, ఆ జిల్లాలో పనిచేయుటకు సోదరులు జాషువాగారు ఈ పత్రిక ముద్రించుసరికి బయలుదేరి వెళ్లనైయున్నారు. వరంగల్లు స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ జనవరి 5న ప్రారంభించబడి నెహెమ్యా గూటంగారి నాయకత్వమున 20 మంది విద్యార్థులతో నడుచుచున్నది.

ఫిబ్రవరి 23, 24 తేదీలలో కాకినాడలో సువార్తికుల సదస్సు జరుపబడును. అందరు ఆహ్వానితులే. ★

---

Regd. No. H/KD—45/KD H.O
Date of Posting : 15th of Every month

From
SATYA VAKKU
P.O. Box 80
KAKINADA 533 001

No.

To

..............................................

..............................................

..............................................

..............................................